# బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల సమగ్రాభివృద్ధి

- బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్
- బోధన్ మండలంలో ఎన్నికల ప్రచారం



బోధన్ మండలం కొప్పర్గలో మాట్లాడుతున్న బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్

బోధన్ / బోధన్ రూరల్, నవంబర్ 16: సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పాలనలోనే బోధన్ నియోజకవర్గంలోని గ్రామాల్లో సమగ్రాభివృద్ధి సాధ్యమైందని బోధన్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అన్నారు. గురువారం బోధన్ మండలంలోని బర్దిపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. మండలంలోని పెంటాకలాన్, భూలక్ష్మి క్యాంప్, పెగడపల్లి, లంగ్డాపూర్, చిన్న మావంది, పెద్ద మావంది, బండారుపల్లి, రాంపూర్, కల్దుర్కి, సిద్ధాపూర్, ఖండ్‌గాం, బిక్‌నెల్లి, కొప్పర్గా, హంగర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ తొమ్మిదిన్నర ఏండ్లలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లతోపాటు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన వారి వివరాలను ఆయన వివరించారు. ఈ సంక్షేమ పథకాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలంటే బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ హయాంలో బోధన్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని, భూముల ధరలు గణనీయంగా పెరిగాయని షకీల్ అన్నారు. పొరపాటున కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధును రద్దు చేస్తారని, దీంతో ఇక్కడ భూముల ధరలు పడిపోతాయని హెచ్చరించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అనేక కుటుంబాలు లబ్ధిపొందాయని చెప్పారు. బీఆర్‌ఎస్ మరోసారి అధికారంలోకి వచ్చాక రైతు బంధు పెట్టుబడి సాయాన్ని క్రమంగా రూ. 16వేలకు పెంచుతారని, రైతు బీమా మాదిరిగానే ప్రతి ఒక్కరికీ కేసీఆర్ బీమా సౌకర్యం కల్పిస్తారని, ప్రతి మహిళకూ సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా రూ. 3వేల సాయం అందిస్తారని చెప్పారు. బోధన్ మండలం కొప్పర్గ వద్ద తన హయాంలో నీలా వంతెనను నిర్మించామని, హంగర్గా గ్రామంలో డబుల్ రోడ్డు వేయించామని ఆయన గుర్తు చేశారు. బిక్నెల్లి గ్రామంలో హనుమాన్ గుడికి రూ. 5లక్షలు మంజూరు చేయిస్తానని, ఇదే గ్రామంలో శివాలయ నిర్మాణానికి సాయం అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. డీసీసీబీ డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, గింజుపల్లి శరత్, సాలూరా, బోధన్ మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు గోగినేని నర్సయ్య, సంజీవ్ కుమార్, పార్టీ నాయకులు బుద్దె రాజేశ్వర్, సాలూరా షకీల్, బోధన్ మండలం వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, నాయకులు ఖలీల్ పటేల్, జమీల్ పటేల్, రాములు, వివిధ గ్రామాల సర్పంచులు గుండారం శంకర్, సాయారెడ్డి, బెజ్జం వెంకట్‌రెడ్డి, పవన్, శ్యాంరావు, నాగరాణి పీరాజి, ఖండ్‌గాం ఎంపీటీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



సభ ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# రేపు నవీపేటకు హరీశ్‌రావు

- బీఆర్‌ఎస్ ప్రచార సభలో ప్రసంగించనున్న మంత్రి
- ఏర్పాట్లు చేస్తున్న నాయకులు

నవీపేట, నవంబర్ 16: మండల కేంద్రానికి శనివారం ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు రానున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వొక్కెర్ల నర్సింగ్‌రావు గురువారం తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని అన్నారు. మండల కేంద్రంలోని ఆశానగర్ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద బహిరంగ సభకు స్థలాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. దర్యాపూర్ తండా సమీపంలోని విఠలేశ్వర్ ఆలయం వద్ద హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బహిరంగ సభా స్థలాన్ని జేసీబీతో చదును చేసినట్లు నర్సింగ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తెడ్డు పోశెట్టి, దొంత ప్రవీణ్‌కుమార్, అల్లం రమేశ్, తహేర్, సర్ఫరాజ్, సాయికుమార్‌గౌడ్, లింగారెడ్డి, శ్యామ్, అఫ్సర్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం

శక్కర్‌నగర్, నవంబర్ 16: బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్‌కు మద్దతుగా బోధన్ పట్టణంలోని 13వ వార్డు ఆజంగంజ్, చెక్కిక్యాంప్‌లో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ బోధన్ పట్టణ యూత్ అధ్యక్షుడు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో రూపొందించిన అంశాలను ఓటర్లకు వివరించారు. తొమ్మిదిన్నర ఏండ్లలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ప్రతి గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు ఎమ్మెల్యే చేయించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన వివరాలను వివరించారు.నాయకులు భూమయ్య, నాగరాజు, రమేశ్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, శివ శంకర్, రమణ, బాలనర్సు, డీసీ శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



బోధన్‌లోని 13వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

**మైనార్టీ నాయకుల ప్రచారం**

నవీపేట, నవంబర్ 16: ఫత్తేనగర్‌లో ఉప సర్పంచ్ బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు జియావుద్దీన్ ఆధ్వర్యంలో షకీల్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు ఉమర్, మైనార్టీ అధ్యక్షులు అలీమ్, రహీమ్, శివ, రఘు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. మండంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ షకీల్‌కు మద్దతుగా ప్రచారం చేశారు.



నవీపేట మండలం ఫత్తేనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మైనార్టీ నాయకులు

**బోధన్, సాలూరా మండలాల్లో ..**

బోధన్ రూరల్, నవంబర్ 16: బోధన్, సాలూరా మండలాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి షకీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సిర్ప సుదర్శన్, ఈర్వంత్ నాయక్, విఠల్, మోతీరాం, పోశెట్టి పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై ఉదయ్‌కుమార్

రెంజల్, నవంబర్ 16: మండలంలోని తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని కందకుర్తి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద గురువారం ఎస్సై ఉదయ్‌కుమార్ వాహనాలు తనిఖీ చేశారు. ఆధారాలు లేకుండా మద్యం, నగదు తరలిస్తూ పట్టుబడితే సంబంధిత శాఖకు అప్పగిస్తామని ఎస్సై పేర్కొన్నారు.

## 'వెల్డర్స్ అందరం ఐక్యంగానే ఉన్నాం'

శక్కర్‌నగర్, నవంబర్ 16: బోధన్‌లో వెల్డర్స్ కార్యవర్గం ఏర్పాటు చేసుకుని అందరం ఐక్యంగానే ఉన్నామని ఆ సంఘం అధ్యక్షుడు రామస్వామి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కొందరు తమ అసోసియేషన్‌కు రాజకీయాలను కలిపి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వెల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వెల్డర్స్ ఈ విషయాన్ని గుర్తించాలని, తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారి మాటలు నమ్మవద్దని ఆయన సూచించారు. ఎవరికి నచ్చిన పార్టీకి వారు అనుకూలంగా ఉంటామని, రాజకీయాలకు సంఘం దూరమని ఆయన అన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తే సహించబోమని అన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శ ఖాజా మొయినుద్దీన్, కార్యదర్శి మజార్, ట్రెజరర్ యూనుస్, సభ్యులు షేక్ యూసుఫ్, కరీం పటేల్‌తో పాటు పలువురు వెల్డర్స్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డ్ మృతి

నవీపేట, నవంబర్ 16: మండల కేంద్రంలోని శివాజీ విగ్రహం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై యాదగిరిగౌడ్ కథనం ప్రకారం.. రెంజల్ మండలం కూనేపల్లి గ్రామానికి చెందిన కొడూరు నగేశ్(48) నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో డ్యూటీ నిమిత్తం స్వగ్రామం నుంచి నిజామాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా స్కూటీ బలంగా ఢీ కొట్టడంతో నగేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. మృతుడికి భార్యా, పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.